ఈనాడు
సిద్దిపేట
మంగళవారం అక్టోబరు 8, 2024


## ఘనంగా బహుజన బతుకమ్మ వేడుకలు



హుస్నాబాద్‌లో బహుజన బతుకమ్మ ఆడుతున్న మంత్రి పొన్నం, విమలక్క తదితరులు

హుస్నాబాద్, న్యూస్‌టుడే: పట్టణంలో బహుజన బతుకమ్మ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క పాల్గొని ఆటపాటలతో అలరించారు. మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ.. మహిళలంతా సుఖసంతోషాలతో పండగ జరుపుకోవాలన్నారు. స్త్రీకి ప్రకృతికి విడదీయరాని బంధం ఉందని విమలక్క అన్నారు. ప్రకృతిలో సహజంగా దొరికే పువ్వులతో శ్రమజీవులు జరుపుకునేదే బతుకమ్మ పండగ అన్నారు. కార్యక్రమంలో మంత్రి సతీమణి మంజుల, పుర అధ్యక్షురాలు ఆకుల రజిత, ఉపాధ్యక్షురాలు అనిత, తెలంగాణ ఐకాస సమన్వయకర్త మేకల వీరన్నయాదవ్, సామాజిక సేవకురాలు కర్నకంటి మంజులారెడ్డి, సహకార సంఘం ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, పురపాలిక మహిళా కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణాదేవిగా అమ్మ దర్శనం



వర్గల్ విద్యా సరస్వతి అమ్మవారు సోమవారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలి వచ్చారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ప్రతాపరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి శేషవస్త్రంతో ఆలయ ఛైర్మన్ న్యాయవారని చంద్రశేఖర్ శర్మ హరీశ్‌రావును సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు. గజ్వేల్ పుర ఛైర్మన్ రాజమౌళిగుప్తా, మాదాసు శ్రీనివాస్, బాలమల్లు యాదవ్, వెంకట్‌రెడ్డి ఉన్నారు. – న్యూస్‌టుడే, వర్గల్

## ప్రేరణగా నిలిచి..

### అత్యధిక నామినేషన్లలో జిల్లా ప్రథమం

న్యూస్‌టుడే, సిద్దిపేట

ఇన్‌స్పైర్ మనక్.. విద్యార్థుల్లో శాస్త్రీయతను పెంపొందిస్తూ కొత్త ఆవిష్కరణలకు అద్దం పట్టే చక్కటి వేదిక. బాలలు భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహదం చేస్తోంది. నైపుణ్యాలు వెలికి తీసి ప్రోత్సహించేందుకు ఏటా కేంద్ర ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమం. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ విద్యార్థులను ప్రోత్సహిస్తోంది. 2024-25 కుగాను జులై నెలలో నామినేషన్ల స్వీకరణ ప్రారంభించగా.. ఈ నెలలో భారీగా ఆన్‌లైన్‌లో నమోదయ్యాయి. అత్యధిక నామినేషన్లతో జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. 505 విద్యా సంస్థల నుంచి 1,682 నామినేషన్లు అందాయి.

#### మూడేళ్లుగా అగ్రస్థానంలో..

మూడేళ్లుగా అత్యధిక నామినేషన్లతో జిల్లా అగ్రస్థానంలో నిలుస్తోంది. వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి జులై 1న నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రాథమిక వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చడంలో పలువురు ప్రత్యేకత చాటారు. ఈ మేరకు www.inspireawards-dst.gov.in వెబ్‌సైట్, స్మార్ట్‌ఫోన్‌లో ఇన్‌స్పైర్ మనక్ యాప్ ద్వారా సులువుగా నమోదు చేసుకోవచ్చు.



వైజ్ఞానిక ప్రదర్శన (పాతచిత్రం)

#### ముందంజలో సర్కారు బడులు..

తొలుత నామినేషన్ల స్వీకరణ వడివడిగా ఆరంభమైంది. అక్టోబరులో భారీగా అందాయి.

అందిన నామినేషన్లు ఇలా..

| విభాగం | విద్యా సంస్థలు | నామినేషన్లు |
|---|---|---|
| ఉన్నత పాఠశాలలు | 227 | 1,010 |
| కేజీబీవీ | 22 | 108 |
| ఆదర్శ | 14 | 90 |
| గురుకులాలు | 42 | 210 |
| ప్రైవేటు | 200 | 264 |

మొత్తం విద్యాసంస్థలు: 505 ● విద్యార్థులు: 85వేలు

ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో పూర్తిస్థాయిలో వచ్చాయి. దాదాపు శత శాతం స్పందన లభించిందని అధికారులు చెబుతున్నారు. వివిధ దశల్లో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్ బృందం పాఠశాలల నిర్వాహకులకు అవగాహన కల్పించి జీవ, భౌతిక, రసాయనశాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. గణిత, రసాయనశాస్త్ర, ఇతర ఉపాధ్యాయులకు ఫోన్లలో ప్రేరణ కల్పించారు. సర్కారు బడుల్లో ఒక్కో పాఠశాల నుంచి 3- 5 వరకు నామినేషన్లు అందాయి. ఈసారి పలు చోట్ల ఐడియా బాక్సును అందుబాటులోకి తెచ్చారు. ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు ఆశించిన మేర ఆసక్తి చూపడం లేదు. అధికారులు వివిధ దశల్లో అవగాహన కల్పించినా స్పందన కరవైంది.

## లక్ష్యం నిర్దేశించుకొని చదివితే ఉన్నత శిఖరాలకు



గజ్వేల్: దుర్గామాత వద్ద పూజల్లో పాల్గొన్న హరీశ్‌రావు తదితరులు

సిద్దిపేట టౌన్, గజ్వేల్ గ్రామీణ, కొండపాక గ్రామీణం– న్యూస్‌టుడే: లక్ష్యాలు నిర్దేశించుకొని చదివి విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు సాధించిన 200 మంది విద్యార్థులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు సన్మానించారు. అంతకు ముందు పట్టణంతోపాటు చిన్నకోడూరు, పెద్దకోడూరు, మర్పడ్గ, గజ్వేల్ పట్టణంలోని సమీకృత మార్కెట్ ఆవరణలో అమ్మవార్లకు పూజలు చేశారు. మర్పడ్గలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ పుర ఛైరపర్సన్ రాజమౌళి, భారాస నాయకులు మాదాసు శ్రీనివాస్, ర్యాగళ్ల దుర్గయ్య, నూనె కుమార్ ఉన్నారు.

## ఒక్కొక్క పువ్వేసి ఉయ్యాలో..



పోలీసు కమిషనరేట్‌లో ఉద్యోగులు, సిబ్బంది



కలెక్టరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

సిద్దిపేట టౌన్: బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వివిధ శాఖల బతుకమ్మలు ఆకట్టుకున్నాయి. సంబురాలను కలెక్టర్ మనుచౌదరి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. మహిళా ఉద్యోగినులతో కలిసి బతుకమ్మ ఆడారు. పోలీసు కమిషనరేట్‌లో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. పురపాలిక సంఘం ఆధ్వర్యంలో కోమటిచెరువు కట్టపై ఆడారు. బల్దియాఅధ్యక్షురాలు మంజుల, అధికారులు ప్రేరణ, మాధవి, వనిత, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సంబరాల్లో ఉద్యాన శాఖకు ప్రథమ, పంచాయతీ శాఖకు ద్వితీయ, టీఎన్జీవో బృందానికి తృతీయ బహుమతి లభించగా.. కలెక్టర్ జ్ఞాపికలు అందించారు. పోలీసు కమిషనరేట్‌లో సంబరాల్లో సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ప్రథమ, త్రీటౌన్ ద్వితీయ, తొగుట ఠాణా తృతీయ స్థానాల్లో నిలవగా.. నగదు బహుమతి ఇచ్చారు.

## నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా సిద్దిపేట గ్రామీణ మండలం ఇర్కోడు గ్రామంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ శ్రీనివాసులు తెలిపారు. రైతులు, వినియోగదారులు గమనించి విద్యుత్తు శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

## జిల్లాస్థాయి ఫొటోలు, లఘుచిత్రాల పోటీలు: సీపీ



సిద్దిపేట టౌన్: పోలీసు అమరవీరుల సంస్మరణ (అక్టోబరు 21..ఫ్లాగ్‌డే) దినోత్సవాన్ని పురస్కరించుకొని కమిషనరేట్ పరిధిలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లకు లఘుచిత్రాలకు సంబంధించి జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు సీపీ అనూరాధ తెలిపారు. ఈ మేరకు సోమవారం వివరాలు వెల్లడించారు. పోలీసుల త్యాగాలు, విధుల్లో ప్రతిభను తెలిపేలా ఉండే ఫొటోలు, తక్కువ నిడివి గల లఘుచిత్రాన్ని తీసి ఈనెల 20వ తేదీలోపు పంపాలన్నారు. మూడు ఫొటోలు 10/8, మూడు నిమిషాల లఘుచిత్రం పెన్‌డ్రైవ్‌లో వేసి కమిషనరేట్‌లో అందించాలన్నారు. అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తిప్రతిష్ఠలను పెంపొందించే అంశాలకు సంబంధించి 2023 అక్టోబరు నుంచి ఇప్పటివరకు తీసిన ఫొటోలు, లఘుచిత్రాలు మాత్రమే పంపించాలని కోరారు. మరిన్ని వివరాలకు 94403 79237 చరవాణి నెంబరులో సంప్రదించాలన్నారు. జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన నామినేషన్లను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. అక్కడ గెలుపొందిన వారికి నగదు పురస్కారం అందిస్తారన్నారు.

## సామాజిక అంశాలపై అవగాహన అవసరం



మొక్కలు పెంచేందుకు సంచుల్లో మట్టి నింపుతున్న విద్యార్థులు

వర్గల్, న్యూస్‌టుడే: చదువుతోపాటు సామాజిక అంశాలపై అవగాహన పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ప్రముఖ రచయిత పల్లెర్ల రామ్మోహన్‌రావు అన్నారు. నాలుగు రోజులుగా వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో జరుగుతున్న 'సంచికి దూరం' కార్యక్రమానికి సోమవారం ఆయన హాజరై విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కల ఉంటుందని, దాన్ని సరైన సమయంలో బయటపెట్టాలన్నారు. చదువుల్లో రాణిస్తూనే ఇష్టమైన రంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకునేలా కృషి చేయాలన్నారు. బ్యాగ్ లెస్ డే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మొక్కల పెంపకం, ముగ్గులు వేయడం, ప్లాస్టిక్ రహిత సంచులు తయారు చేయడం, కళల్లో నైపుణ్యాన్ని సాధించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నారు. వయోలిన్, గిటార్, వాయిద్య పరికరాలతో సంగీతం తదితర అంశాలపై ఉపాధ్యాయులు మెలకువలు నేర్పిస్తున్నారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటుతూ ముందుకు సాగుతున్నారు.

## సుందరీకరణ ఏదీ?

### ప్రజ్ఞాపూర్, అహ్మదీపూర్‌లో ఆగిన మినీట్యాంక్‌బండ్ పనులు



ప్రజ్ఞాపూర్ చెరువు కట్టపై మొలిచిన కంప చెట్లు

న్యూస్‌టుడే, గజ్వేల్: గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన మినీ ట్యాంక్‌బండ్ పనులు అర్థాంతరంగా ఆగిపోవడంతో తమ గ్రామ చెరువులు సుందరీకరణతో ఆహ్లాదాన్ని పంచుతాయని ఆశపడిన ప్రజలకు నిరాశ తప్పటం లేదు. సుమారు నాలుగేళ్ల కిందట ప్రారంభించిన అభివృద్ధి పనులు ఎప్పుడు పూర్తవుతాయా అని ఆశగా ఎదురు చూస్తున్నారు. గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్, అహ్మదీపూర్ గ్రామాల్లోని చెరువుల ద్వారా సాగు నీటి అవసరాలు తీర్చడంతో పాటు ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా ఆధునికీకరించి మినీ ట్యాంక్‌బండ్‌లుగా అభివృద్ధి చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. అందులో భాగంగా ప్రజ్ఞాపూర్ చెరువుకు రూ.5.66 కోట్లు, అహ్మదీపూర్ చెరువుకు రూ.4.66 కోట్లు మంజూరు చేసింది. నీటిపారుదల(ఇరిగేషన్) శాఖ పరిధి పనులు పూర్తి కాగా, టూరిజం శాఖ ద్వారా చేపట్టే సుందరీకరణ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి.

#### మధ్యలోనే ఆగిన పనులు..

గజ్వేల్, ప్రజ్ఞాపూర్ పట్టణాల మధ్య వారధిగా దాదాపు 40 ఎకరాల శిఖం భూమి ఉన్న ప్రజ్ఞాపూర్ చెరువును ఆధునికీకరిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని భావించిన సర్కారు నిధులు మంజూరు చేసింది. కట్ట వెడల్పు, రెయిలింగ్, రెండు వైపులా పిట్ట గోడలు, రాతి కట్టడం, రెండు తూముల మరమ్మతులు, మత్తడి, వరద కాలువకు స్లాబ్, మూడుచోట్ల మెట్లు, రెండు వైపులా స్టీల్ గొట్టాల ఏర్పాటు తదితర పనులు చేపట్టారు. కట్టపై పార్కు, గజబోలు, ఊయలలు, బల్లలు ఏర్పాటుతో పాటు, మొక్కలు నాటి సుందరీకరించే పనులున్నాయని అధికారులు చెబుతున్నారు. పనులు ఆగిపోవడంతో కట్టపై ముళ్ల చెట్లు మొలిచాయి. నిత్యం ఉదయం నడక సాగించేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ చెరువును బాగు చేస్తే వేలాది మందికి ఆహ్లాదం అందనుంది.

#### అందుబాటులోకి తెస్తే మేలు

చెరువు కట్ట వెడల్పు, బతుకమ్మ మెట్లు, రివిట్‌మెంట్, మత్తడి మరమ్మతులు, కిలోమీటరు మేర పంట కాలువ, సింగాటం వైపు వరద కాలువ, ఒక వైపు కట్టపై పిట్టగోడ నిర్మించారు. మరోపక్క పిట్టగోడ నిర్మాణంతో పాటు మట్టి పనులు మిగిలి ఉన్నాయి. టూరిజం పరిధిలో సెంట్రల్ లైటింగ్, పార్కు, బల్లలు, పిల్లల ఆట వస్తువులు తదితర పనులు అలాగే ఉన్నాయి. ఈ రెండు చెరువుల సుందరీకరణ పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.


## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేసీఆర్ చిత్రపటానికి వినతి పత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

గజ్వేల్, న్యూస్‌టుడే: వారం రోజుల్లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేయకుంటే మాజీ సీఎం కేసీఆర్ నివాసాన్ని ముట్టడిస్తామని గజ్వేల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. సోమవారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలిచి పది నెలలైనా నియోజకవర్గంలో అడుగుపెట్టలేదన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మన్ సర్దార్‌ఖాన్, పుర మాజీ ఛైర్మన్ గాడిపల్లి భాస్కర్, నాయకులు వెంకట్ నరసింహారెడ్డి, మతీన్, రేగొండ, జహీర్, గణేష్ పాల్గొన్నారు.

## ఆధిపత్యానికే కాంగ్రెస్ నేతల ఆరాటం



ఠాణాలో ఫిర్యాదు చేస్తున్న ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, భారాస నేతలు

గజ్వేల్, న్యూస్‌టుడే: రెండు గ్రూపులుగా విడిపోయిన గజ్వేల్ కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి మెప్పు పొందేందుకు ఆధిపత్య రాజకీయాలు చేస్తున్నారని ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, భారాస నేతలు మండిపడ్డారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసేది ప్రభుత్వమా.. ప్రతిపక్షమా చెప్పాలన్నారు. లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయాలని ఇప్పటికే మంత్రులు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. క్యాంపు కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఠాణాలో ఫిర్యాదు ఇచ్చారు. పుర ఛైర్మన్ ఎన్సీ రాజమౌళి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మాదాసు శ్రీనివాస్, నాయకులు పి.మల్లేశం, మధు, నవాజ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, విరాసత్ అలి, హనుమంతరెడ్డి, హైమద్ ఉన్నారు.

## ప్రజావాణికి 22 దరఖాస్తులు



పంట నష్టపోయామని గోడు వెళ్లబోసుకుంటున్న రైతు దంపతులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సమీకృత కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు అధికారులకు అర్జీలు సమర్పించారు. రెండు పడక గదుల ఇళ్లు, ఆసరా పింఛన్లు, భూసంబంధ సమస్యలు పరిష్కరించాలని 22 దరఖాస్తులు ఇచ్చారు. వాటిని పరిశీలించిన జిల్లా అదనపు పాలనాధికారి శ్రీనివాస్‌రెడ్డి వివిధ శాఖల అధికారులకు బదిలీ చేశారు. కార్యక్రమంలో డీఆర్డీవో జయదేవ్ ఆర్య, డీఆర్వో నాగరాజమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● నాసిరకం విత్తనాలతో మూడెకరాల్లో వరి పంట నష్టపోయామని కొండపాక మండలం శెలంపు గ్రామానికి చెందిన దంపతులు పాతర్ల రాములు, మల్లమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేటలోని ఓ ఎరువుల దుకాణంలో విత్తనాలు కొన్నామన్నారు. నష్టపరిహారం ఇప్పించాలని పాడైన వరి గొలుసులతో వచ్చి ప్రజావాణిలో అర్జీ సమర్పించారు.

## కారు ఢీకొని ఒకరి మృతి

చిన్నకోడూరు: కారు ఢీకొని ఒకరు మృతి చెందారు. ఎస్సై బాలకృష్ణ తెలిపిన వివరాలు. . రాజన్న సిరిసిల్ల జిల్లా రేపాకకు చెందిన బొడిగె కిరణ్‌గౌడ్(35) వ్యవసాయ పనులు చేసేది. అత్తగారి ఊరు కోహెడ మండలం వర్కోల్‌లో ఉంటున్నాడు. ఆదివారం ఉదయం పనిపై సిద్దిపేటకు వెళ్లి అర్ధరాత్రి రాజీవ్ రహదారిపై నడుచుకుంటూ వస్తుండగా.. మల్లారం శివారులో కారు ఢీకొని రోడ్డు పక్కన పొదల్లోకి దూసుకెళ్లింది. తలకు తీవ్ర గాయాలై కిరణ్‌గౌడ్ అక్కడికక్కడే మృతిచెందాడు. సోమవారం కారు డ్రైవర్ సుధాకర్‌పై కేసు నమోదైంది.

## 'దిట్ట'ంగానే 'మల్లన్న' లడ్డూ





లడ్డూలు తయారు చేస్తున్న మహిళలు

న్యూస్‌టుడే, చేర్యాల: తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి ఏటా సుమారు 25 లక్షలకుపైగా భక్తులు కొమురవెల్లి మల్లికార్జునస్వామిని దర్శించుకొంటున్నారు. సంక్రాంతి నుంచి ఉగాది వరకు దాదాపు మూణ్నెల్లపాటు జాతర సాగుతుంది. ఏటా రూ.18 కోట్లకుపైగా వార్షికాదాయం వస్తోంది. 'మల్లన్న'ను దర్శించుకొని తరించిన ప్రతి భక్తుడు స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అంతే భక్తితో స్వీకరిస్తాడు. భక్తుల నమ్మకం మేరకు ఆలయ వర్గాలు ప్రసాదాలు తయారు చేస్తున్నారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా శుచీశుభ్రత పాటిస్తున్నారు. కరోనా వేళ విక్రయాలు లేక కొన్ని లడ్డూలు పాడవగా విమర్శలు వెల్లువెత్తాయి. ఆ తరవాత దిట్టంగానే(వినియోగించే వస్తువుల జాబితా) తయారు చేస్తున్నారు. కొమురవెల్లి ఆలయం వద్ద జాతర సమయంలో ప్రతి ఆదివారం సుమారు 30- 35 వేల లడ్డూలు అమ్ముడవుతాయి. ఆ తరవాత ప్రతి ఆదివారం సుమారు 10వేల లడ్డూలు అమ్ముడవుతున్నట్లు ఆలయ వర్గాల అంచనా. స్వామివారి కల్యాణోత్సవం, జాతర మొదటి ఆదివారం 'పట్నంవారం', రెండో ఆదివారం 'లష్కర్‌వారం', శివరాత్రి రోజు జరిగే పెద్దపట్నం, ముగింపు ఘట్టమైన అగ్నిగుండ ప్రవేశాల రోజుల్లో మాత్రం సుమారు 70వేల నుంచి లక్ష వరకు లడ్డూలను భక్తులు కొంటుంటారు. ఆలయానికి నెయ్యిని కరీంనగర్ డెయిరీ వారు సరఫరా చేస్తున్నారు. ఇతర సరకులు ఆన్‌లైన్ టెండర్ ప్రకారం హక్కులు దక్కించుకున్న హైదరాబాద్‌కు చెందిన ఏజెన్సీ అందిస్తోంది.

#### జాగ్రత్తలు తీసుకుంటున్నాం..

– ఆలూరు బాలాజీ, కమిషనరు

కొన్నేళ్లుగా కరీంనగర్ డెయిరీ నుంచి నెయ్యి కొంటున్నాం. ఇటీవల కమిషనరు ఆదేశాల మేరకు విజయ డెయిరీ నుంచి తీసుకోవాలని నిర్ణయించాం. అలాగే ప్రసాదాల తయారీలో ఎలాంటి నిర్లక్ష్యం లేదు. నిబంధనల మేరకు 'దిట్టం' ప్రకారం నాణ్యతతో లడ్డూ తయారు చేసి భక్తులకు అందిస్తున్నాం.

# అదనులో సాగు.. దిగుబడి బాగు

**న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్**



చిక్కుడు సాగుకు చల్లని వాతావరణం అవసరం. శీతాకాలం పంటగా ప్రస్తుత తరుణంలో సాగు చేయాలని చెబుతున్నారు సంగారెడ్డి జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారిణి సునీత. శీతాకాలం పంటగా అక్టోబరు-నవంబరు మాసాలలో సాగు చేయాలి. ఈ పంట అధిక ఉష్ణోగ్రత, అధిక వర్షపాతాన్ని, అధిక మంచును తట్టుకోలేదు.

**అనుకూలమైన రకాలు:** తీగ రకం: కెంటకీ వండర్, టీకేడీ-1. **పొది రకం:** కంటెండర్, అర్కికోమల్, అర్కసువిధ **నేలలు..:** ఇసుకతో కూడిన ఎర్ర గరప, ఒండ్రు నేలలు, నీటి వసతి ఉన్న బరువైన నేలలు అనుకూలం. ఉదజని సూచిక 5-3-6 ఉన్నవి అనుకూలం.

## విత్తనాలు, ఎరువులు..

- తీగ రకాలైతే ఎకరానికి 10-12 కిలోలు, పొద రకం ఎకరానికి 20-24 కిలోల విత్తనాలు అవసరం ఉంటాయి. పొలంలో విత్తే ముందు 3 గ్రా. థైరామ్ లేదా కాప్టాన్ వినియోగించి కిలో విత్తనాన్ని శుద్ధి చేయాలి.
- దుక్కి దున్ని 30-35 సెం.మీ. దూరంలో బోదెలు వేసుకోవాలి. ఒక్కో వరుసలో 25-30 సెం.మీ. దూరంలో విత్తనాలు నాటాలి.
- ఆఖరి దుక్కిలో ఎకరాకు 8-10 టన్నుల పశువుల ఎరువుతో పాటు 10 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్ చల్లితే ప్రయోజనంగా ఉంటుంది.

## చీడపీడల నివారణ..

ఈ పంటకు పలు రకాల తెగుళ్లు ఆశిస్తాయి. తామర పురుగుల నివారణకు ఎసిఫేట్ 300 గ్రా. లేదా ఫిప్రోనిల్ 400 మి.లీ. 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.

- పేనుబంక తెగులు ఆశిస్తే మిథైల్ డిమెటాన్ 400 మి.లీ. లేదా ఎసిఫేట్ 300 గ్రా. 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.
- భూమిలో తేమ అధికంగా ఉంటే వేరుకుళ్లు తెగులు ఆశిస్తుంది. లేతమొక్కలు చనిపోతాయి. 10 గ్రా. ట్రైకోడెర్మావిరిడి లేదా 3 గ్రా. థైరామ్‌తో విత్తన శుద్ధి చేసుకోవాలి.
- ఆకుమచ్చ తెగులు నివారణకు సీఓసీ 3 గ్రా. లేదా మాంకోజెబ్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

## నీటి తడులు..

పూత దశలో ఎకరానికి 10 కిలోల నత్రజనిచ్చే ఎరువులు వేయాలి. అనంతరం నీటి తడులు అందించాలి. నేల స్వభావాన్ని బట్టి 7-10 రోజుల వ్యవధిలో నీరు పెట్టాలి. పూత దశలో తేమ ఎక్కువ, తక్కువ కాకుండా చూసుకోవాలి. సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులకు అవకాశం ఉంటుంది. తీగ రకాలైతే ఎకరానికి 5-6 టన్నులు, పొదరకం 3-4.5 టన్నుల వరకు వస్తుంది.

# రైతేరాజు

## సాగులో సందేహాలా?

సంప్రదించాల్సిన ఫోన్ నం:
**93815 15588**

సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, సస్యరక్షణపై రైతుల ప్రశ్నలకు సిద్దిపేట తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం సమన్వయకర్త విజయ్ సమాధానాలు ఇచ్చారు.

**ప్రశ్న:** వరిలో ఆకులపై పసుపు రంగు మచ్చలు కనిపిస్తున్నాయి. నివారణ చర్యలు తెలపండి? – **గోవర్ధన్, తాండూరు**

**సమాధానం:** ఎండాకు తెగులు సోకితే ఇలాగే జరుగుతుంది. వెంటనే పై పాటుగా నత్రజని ఎరువు వేస్తే ఫలితం ఉంటుంది.

– న్యూస్‌టుడే, చేర్యాల

## వేరుసెనగలో సస్యరక్షణ కీలకం

నూనె గింజల పంటల సాగులో ప్రధానమైన వేరుసెనగలో సస్యరక్షణ పక్కాగా చేపడితే అధిక దిగుబడి సాధ్యం. ప్రస్తుత యాసంగిలో అత్యధికులు ఈ పంట సాగు చేస్తున్నారు. సెప్టెంబరులో పలువురు దీన్ని పండిస్తున్నారు. ఇప్పటికే మొలకలు వచ్చాయి. ప్రస్తుతం ఆకుముడత, పొగాకు లద్దె పురుగు ఎక్కువగా ఆశించే అవకాశం ఉంది. ఆకు ముడత నివారణకు లీటరు నీటికి నొవాల్యురాన్ 1 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి. పొగాకు లద్దె పురుగు నివారణకు లీటరు నీటికి 5.మి.లీ. వేపనూనె లేదంటే 2 మి.లీ.క్వినాల్‌ఫాస్‌ను కలిపి పిచికారీ చేయాలి. **- న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ**

# సమష్టిగా అడుగేస్తూ.. లాభాలు ఆర్జిస్తూ..



కాకర తోట



మధుసూదన్‌రెడ్డి



లక్ష్మారెడ్డి

సమష్టిగా ముందుకు సాగితే ఏదైనా సాధ్యమే. ఏ రంగంలో నైనా ఇది వర్తిస్తుంది. ఈ సూత్రాన్ని పాటించారు ఈ అన్నదమ్ములు కలిసి సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. వారే నర్సాపూర్ మండలం ఆవంచకు చెందిన మధుసూదన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి. వీరికి పదెకరాల పొలం ఉంది. ఐదెకరాలలో వరి, మిగతా దాంట్లో బీర, సొర, కాకరలతో పాటు ఆకుకూరలు పండిస్తున్నారు. మొదట్లో మామూలుగా పండించగా.. ఆ తర్వాత పందిరి సాగు విధానాన్ని పాటిస్తున్నారు. కడీలు పాతించిన తీగలు అల్లి చారు. అంతర పంటగా ఆకుకూరలు సాగు చేస్తున్నారు.

### నీటిని నిల్వ చేసుకొని..

పంటలకు అవసరమైన మేర నీటి తడులు అందించాలన్న ఉద్దేశంతో పొలంలో నిల్వ గుంత తవ్వించారు. అందులోకి వాన నీరంతా చేరేలా ఏర్పాట్లుచేశారు. బోరు నీటిని సైతం అందులోకి పారిస్తారు. అందులోనే సేంద్రియ ఎరువులు కలిపి బిందు పరికరాల ద్వారా కూరగాయల మొక్కలకు పారేలా చేస్తున్నారు. ఈ విధానంలో సమయం ఆదా కావడంతో అవసరం మేర మాత్రమే నీటిని వాడుతున్నారు. ఒకే పంట కాకుండా పలు రకాల పంటలు సాగు చేయడం ద్వారా అంతగా నష్టం వాటిల్లదు. మూడు నెలల్లో ఆయా రకాలు 300 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. విత్తనాలు, ఎరువులు తదితర వాటికి రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి అవుతోంది. దిగుబడులను నర్సాపూర్, హత్నూర మండలం దౌల్తాబాద్, జిన్నారం మార్కెట్లలో విక్రయిస్తున్నారు. రూ.3 లక్షల వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు. పెట్టుబడి పోగా రూ.1.50 లక్షల వరకు లాభం మిగులుతోంది. మరోవైపు వరితో రూ.3 లక్షల వరకు ఆర్జిస్తున్నారు. ఆకుకూరలతో రూ.50 వేల వరకు వస్తున్నాయి.

– న్యూస్‌టుడే, నర్సాపూర్ రూరల్

## పత్తిలో వేరుకుళ్లు తెగులా..



పత్తిలో వేరుకుళ్లు తెగులు అధిక తేమ శాతం కారణంగా ఆశిస్తుంది. దీని నివారణలో నిర్లక్ష్యం చేస్తే దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తెగులు నివారణకు లీటరు నీటికి 3 గ్రా.కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1 గ్రా.కార్బెండజిమ్ కలిపిన ద్రావణాన్ని మొక్కల మొదలు చుట్టూ పిచికారీ చేయాలి. వారం వ్యవధిలో రెండు, మూడు సార్లు ఇలా చేస్తే తెగులు నివారణ సులభమే.

**- న్యూస్‌టుడే, చేర్యాల**

# మెరుగైన సేవలు.. దరిచేరిన పురస్కారాలు

మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వం కాయకల్ప పురస్కారాలు అందిస్తోంది. 2023-24 సంవత్సరానికి రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల నుంచి పలు దవాఖానాలు పురస్కారాలకు ఎంపికై ప్రత్యేకతను చాటడం విశేషం.

**న్యూస్‌టుడే, తాండూరు టౌన్, గజ్వేల్, గుమ్మడిదల**



## అందుబాటులో ఉంటూ..

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సైతం కాయకల్ప అవార్డు దక్కింది. ఇక్కడికొచ్చే రోగులను మర్యాదగా పలకరించి వారి బాధ తెలుసుకొని వైద్య సేవలు అందించడం ఇక్కడి వైద్యులు, సిబ్బందికి అలవాటు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ఎక్కడా రాజీ పడటం లేదు. ఈ కేంద్రానికి నిత్యం 70 నుంచి 100 మంది వరకు పేషెంట్లు వస్తున్నారు. అవసరమైన వారిని జిల్లా కేంద్రానికి రిఫర్ చేస్తున్నారు. మరోవైపు కేంద్రం పరిధిలో గర్భిణుల ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకొని తగు చర్యలు తీసుకుంటున్నారు. అవార్డు కింద రూ.2 లక్షలు రానున్నాయి. ఈ నగదుతో ఆసుపత్రిలో రోగులకు అవసరమైన వసతుల కల్పనకు కృషి చేస్తామని వైద్యులు మధుకర్, విజేతలు తెలిపారు.

## పారిశుద్ధ్యం నిర్వహణలో భేష్



సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని జిల్లా ప్రభుత్వాసుపత్రికి ఇప్పటివరకు మూడుసార్లు వరుసగా కాయకల్ప అవార్డులు దక్కాయి. ఈ సారి ద్వితీయ స్థానంలో నిలిచింది. పరిసరాల పారిశుద్ధ్యం, వైద్య వ్యర్థాల నిర్వహణ, వార్డుల పర్యవేక్షణ తదితర 8 విభాగాల్లో మెరుగైన సేవలు అందిస్తున్నందుకు ఇందుకు ఎంపికైంది. రూ.40 కోట్లతో 100 పడకల సామర్థ్యంతో ఈ ఆసుపత్రిని నిర్మించారు. ప్రస్తుతం నెలకు 350 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. చిన్నపిల్లల ఐసీయూ, వృద్ధులకు మోకాళ్ల చిప్పల మార్పిడి శస్త్ర చికిత్సలు సైతం చేస్తున్నారు. క్యాన్సర్ రోగుల కోసం పాలియేటివ్ వార్డు, 7 పడకల సామర్థ్యంతో డయాలసిస్ కేంద్రం ఏర్పాటయ్యాయి. నెలకు 15 వేల మందికి పైగా ఓపీ, 600 మంది వరకు ఇన్‌పేషంట్లుగా చేరుతున్నారు. పరిసరాలు, ఆవరణ, వార్డులు పరిశుభ్రంగా ఉంచుతున్నారు. నిత్యం 500 కిలోల సాధారణ వ్యర్థాలను బల్దియా సేకరిస్తుండగా, రెండురోజులకో సారి 500 కిలోల బయో వ్యర్థాలను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఆవరణ మొక్కలతో వనాన్ని తలపిస్తోంది.

## ముందంజలో నిలిచి..



ఆసుపత్రిలోని వార్డు

వికారాబాద్ జిల్లా తాండూరులో 20 ఏళ్ల కిందట 200 పడకలతో జిల్లా స్థాయి ఆసుపత్రిని నిర్మించారు. నిత్యం జిల్లా వాసులతో పాటు మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, సరిహద్దు రాష్ట్రం కర్ణాటక నుంచి ప్రజలు ఇక్కడికి వైద్యసేవల నిమిత్తం వస్తుంటారు. రోజూ 800 మందికి పైగా సేవలు పొందుతున్నారు. 100 మంది వరకు ఇన్‌పేషెంట్లు ఉంటున్నారు. వైద్యులు, సిబ్బంది బాధితుల ఇబ్బందులను తెలుసుకొని అందుకు అనుగుణంగా చికిత్స అందిస్తూ ఉపశమనం కలిగిస్తున్నారు. మెరుగైన వైద్య సేవలతో పాటు పరిసరాల శుభ్రత తదితర అంశాల్లో ముందంజలో నిలుస్తోంది. తద్వారా రాష్ట్ర స్థాయిలో అవార్డులు దక్కుతున్నాయి. తొలిసారిగా 2021లో కాయకల్ప అవార్డుకు ఎంపికైంది. 2022లో రెండో సారి, తాజాగా ఈ ఏడాది మూడో సారి అవార్డు దక్కించుకుంది.

- ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, బాధితులకు అందుతున్న వైద్య సేవలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాల్లో మెరుగ్గా ఉండటంతో రాష్ట్ర స్థాయిలో తొలిస్థానంలో నిలిచింది. కాయకల్ప అవార్డు రూ.25 లక్షలు రానున్నాయి. వీటితో వసతుల కల్పనకు ప్రణాళిక రూపొందించనున్నామని ఆసుపత్రి పర్యవేక్షకుడు శంకర్ తెలిపారు.

# పద్య సాహిత్యం సమాజానికి అవసరం



ట్రెండింగ్ పద్యాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: పద్య సాహిత్యం సమాజానికి ఎంతో అవసరమని అవధాని, పద్యసారస్వత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు అవుసుల భానుప్రకాశ్ అన్నారు. పద్యం ద్వారానే బాలలు నీతి నిజాయతీ, న్యాయం నేర్చుకుంటారన్నారు. ఆయన రచించిన 'ట్రెండింగ్ పద్యాలు' పుస్తక పరిచయ సభ సిద్దిపేటలోని వ్యాసమహర్షి యోగా కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భానుప్రకాశ్ మాట్లాడారు. బాలల నుంచి యువత, వృద్ధుల వరకు చదివే పుస్తకం ట్రెండింగ్ పద్యాలు అని అన్నారు. కవి ఐతా చంద్రయ్య మాట్లాడుతూ సంప్రదాయాలకు అనుగుణంగా సాహిత్య రచనలు ఉండాలన్నారు. మరో కవి కొమురవెల్లి అంజయ్య మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా రచనలు రావాలన్నారు. కార్యక్రమంలో గోగులపాటి కృష్ణమోహన్, బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం, వరుకోలు లక్ష్మయ్య, సింగీతం నరసింహారావు, సరస్వతీ రామశర్మ, బస్వ రాజ్‌కుమార్, కాంతికృష్ణ, నాగలత, యాదగిరి, మహేందర్ రెడ్డి, బాలచంద్రం, అంజిరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ సుడోకు పోటీలకు జైపాల్‌రెడ్డి



జైపాల్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి

జహీరాబాద్, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన భాజపా నాయకుడు, మెదక్ డీసీసీబీ మాజీ ఛైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి, ఆయన తనయుడు కార్తీక్‌రెడ్డి ప్రపంచ సుడోకు, పజిల్ పోటీలకు ఎంపికయ్యారు. చైనా బీజింగ్‌లో ఈ నెల 14 నుంచి వారం పోటీలు జరగనున్నాయి. లాజిక్ మాస్టర్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఏడాది పాటు ఆన్‌లైన్ ద్వారా పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని 50 మందిని గుర్తించి, వీరికి గత ఆగస్టు 10,11 తేదీల్లో బెంగళూరులో పోటీలు నిర్వహించి నలుగురు ఎంపిక చేయగా, అందులో జహీరాబాద్‌కు చెందిన వారు ఇద్దరు ఉండటం విశేషం.

# వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

## మనోవేదనతో వృద్ధుడు..

**రామాయంపేట:** పక్షవాతంతో బాధపడుతున్న ఓ వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. రామాయంపేట ఎస్సై పుట్టి స్వామి తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన పుట్టి స్వామి (58) పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మనోవేదనకు గురై ఆదివారం ఇంటి నుంచి వెళ్లాడు. స్థానిక కొత్త చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్వామి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు అన్ని చోట్ల వెతకగా సోమవారం స్థానిక చెరువులో మృతదేహం కనిపించింది. కుమారుడు సాయికుమార్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

## క్యాన్సర్ తగ్గక వృద్ధుడు..



నాగయ్య

**మనోహరాబాద్:** క్యాన్సర్‌తో బాధపడుతున్న మనోహరాబాద్‌కు చెందిన తూం నాగయ్య(60) ఇంట్లోనే ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానిక ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాలు.. నాగయ్య కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. రెండేళ్లుగా పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందినా తగ్గలేదు. ఈ నెల 4న ఇంట్లో ఆత్మహత్యాయత్నం చేశాడు. దీన్ని గమనించిన అతడి భార్య ములుగులోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుమారుడు మల్లేశ్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

## మద్యం మత్తులో యువకుడు..



రాకేష్

**బెజ్జంకి:** మద్యం మత్తులో యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బెజ్జంకి ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని దాచారానికి చెందిన చెందిన బొర్ర రాజు, సరవ్వ చిన్న కుమారుడు రాకేష్ (20) పదో తరగతి వరకు చదివి మానేశాడు. కూలీ పనులతో పాటు హార్వెస్టర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. ఆదివారం రాత్రి భోజనం చేశాక పడక గదిలోకి వెళ్లాడు. వెంటిలెటర్‌కు ఉరేసుకొని వేలాడుతూ కనిపించగా.. కుటుంబీకులు గమనించి కిందికి దించి సీపీఆర్ చేశారు. అప్పుడే చేరుకున్న 108 వాహన సిబ్బంది పరీక్షించి మృతి చెందినట్లు తేల్చిచెప్పారు. ఇంటికొచ్చిన కొడుకు అరగంట వ్యవధిలోనే విగతజీవిగా మారడంతో కుటుంబీకులు బోరున విలపించారు. సోమవారం కేసు నమోదైంది.

# బావిలో పడి మహిళ మృత్యువాత

**రామాయంపేట:** ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిన ఓ మహిళ మృతి చెందింది. రామాయంపేట ఎస్సై బాలరాజు తెలిపిన వివరాలు.. లక్ష్మాపూర్‌కు చెందిన కాసుల నాగవ్వ (53) ఆదివారం రాత్రి తమ పొలానికి వెళ్లింది. అడవి పందుల నుంచి కాపలాకు బ్యాటరీ లైట్‌తో పొలంలో తిరుగుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయింది. సోమవారం ఉదయం కుమారుడు దుర్గరాజు పొలానికి వెళ్లగా తల్లి నాగవ్వ కనిపించలేదు. బావి గట్టుపై చెప్పులు, బ్యాటరీ పడి ఉన్నాయి. అందులో వెతకగా నాగవ్వ మృతదేహం లభ్యమైంది. దుర్గరాజు ఫిర్యాదుతో కేసు నమోదైంది.

# చేపల వేటకు వెళ్లి యువకుడు..



యాదగిరి

**పాపన్నపేట:** చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి ఒకరు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని యూసుఫ్‌పేటకు చెందిన రొడ్డ యాదగిరి(31) రైతు. సోమవారం పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటమునిగి ఊపిరాడక మృతి చెందాడు. అటుగా వెళ్లిన స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

| చికెన్ ధరలు | | | | |
|---|---|---|---|---|
| | ఫాంరేటు | 114-00 | డ్రెస్డ్ | 197-00 |
| | రిటైల్ | 136-00 | స్కిన్‌లెస్ | 224-00 |

# ఫుట్‌బాల్ ఫైనల్‌కు రంగారెడ్డి జట్టు



పోటీలు ప్రారంభిస్తున్న మెదక్ డీఈవో రాధాకిషన్

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మెదక్‌లో కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి అండర్-17 బాలికల ఫుట్‌బాల్ పోటీలు అట్టహాసంగా సాగుతున్నాయి. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్, పోటీల కోఆర్డినేటర్ నాగరాజు ఆధ్వర్యంలో రెండో రోజు సోమవారం మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియం, వెస్లీ పాఠశాల మైదానంలో పోటీలు హోరాహోరీగా జరిగాయి. మొత్తం 10 జట్లు పాల్గొనగా, రెండు గ్రూప్‌లుగా విభజించి లీగ్ కం నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహించారు. లీగ్ దశలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మెదక్, నిజామాబాద్, రంగారెడ్డి, ఆదిలాబాద్ జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. మొదటి సెమీఫైనల్ మ్యాచ్ నిజామాబాద్-రంగారెడ్డి జట్ల మధ్య జరిగింది. ఇందులో రంగారెడ్డి జట్టు ఫైనల్‌కు వెళ్లింది. మరో సెమీఫైనల్ పోటీ మంగళవారం మెదక్, ఆదిలాబాద్ జట్ల మధ్య జరగనుంది. ఇందులో గెలుపొందిన జట్టు రంగారెడ్డితో ఫైనల్‌లో ఆడనుంది. రెండో రోజు పోటీలను మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ప్రారంభించారు. పోటీలకు సినీ నిర్మాత సుధాకర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసరావు, సిద్ధార్థ విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్ చౌదరిలు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో పీడీలు మాధవరెడ్డి, చంద్రమోహన్, శ్యామయ్య, రాజేందర్, సత్యం, దేవేందర్‌రెడ్డి, రవి, పద్మ, సరోజిని, మహిపాల్ తదితరులు ఉన్నారు.

# ఆగిన కుంచె.. మూగపోయిన కంఠం



నర్సింలు

వికారాబాద్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుడు నర్సింలు మృతితో చిత్రాలకు జీవం పోసే కుంచె ఆగిపోయింది. సమాజాన్ని చైతన్యపరిచే కలం నుంచి జాలువారిన గీతాలు, ఆలపించిన కంఠం మూగపోయింది. వికారాబాద్ పుర పరిధి గిరిగిట్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న మర్పల్లి మండలం కల్కోడకు చెందిన నర్సింలు (50) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. వృత్తి రీత్యా ఉపాధ్యాయుడే అయినా ప్రవృత్తిలో చిత్రకళాకారుడిగా, గాయకుడుగా, పాటల రచయితగా అందరికీ సుపరిచితుడు. సమాజాన్ని మేల్కొలిపే బాలల హక్కులు, మూఢనమ్మకాలు, అక్షరాస్యత, తెలంగాణ ఉద్యమంపై ఎన్నో పాటలు రాసి అవార్డులు అందుకున్నారు. ఎంతో మందికి చిత్రలేఖనంలో మెలుకువలు నేర్పించారు. ఆయన మృతికి శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

# కళా ఉత్సవ్ పోటీల్లో కేంద్రీయ విద్యార్థుల ప్రతిభ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఏక్ భారత్ - శ్రేష్ఠ భారత్‌లో భాగంగా ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీల్లో సిద్దిపేట కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ చూపారు. క్లస్టర్ స్థాయి బృందగానం పోటీల్లో ప్రథమ, బృందనృత్యంలో ద్వితీయ స్థానంలో నిలిచారని విద్యాలయ ప్రిన్సిపల్ సూర్యప్రకాశ్, కో-ఆర్డినేటర్లు సంధ్య, పీఈటీ భూమయ్య తెలిపారు. ఈనెల 21 నుంచి మూడు రోజుల పాటు విశాఖపట్నంలో నిర్వహించే రీజినల్ స్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని వెల్లడించారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.

# స్టాన్‌ఫోర్డ్ శాస్త్రవేత్తల జాబితాలో అళగర్ స్వామికి చోటు



సంగారెడ్డి అర్బన్, సంగారెడ్డి గ్రామీణ, న్యూస్‌టుడే: సంగారెడ్డిలోని ఎంఎన్‌ఆర్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.అళగర్ స్వామి స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం ప్రకటించిన ప్రపంచ రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఈ విశ్వవిద్యాలయం సెప్టెంబరు 15న జాబితా ప్రకటించగా.. కళాశాలలో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యాసంస్థల ఛైర్మన్ ఎం.ఎన్.రాజు మాట్లాడుతూ.. అళగర్ స్వామి యాంటీ వైరల్ మెడిసిన్స్ ఫార్మసీలో పరిశోధన చేసినందుకు ప్రపంచ ర్యాంకింగ్‌లో స్థానం దక్కినట్లు పేర్కొన్నారు. 2020 నుంచి ఈ ఏడాది వరకు వరుసగా అయిదు సార్లు జాబితాలో చోటు కల్పించారని, ర్యాంకింగ్స్‌లో తెలంగాణలో ప్రథమ స్థానంలో ఉన్నట్లు తెలిపారు. గ్లోబల్ ర్యాంకు 1,48,458, పరిశోధనల్లో 1,795 ర్యాంకు సాధించారన్నారు. ఆయన పలు రకాల పుస్తకాలు రాసి జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కించుకున్నారన్నారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ రవివర్మ తదితరులు అళగర్ స్వామిని అభినందించారు.



## బతుకమ్మ సంబురం.. ఆనందం అంబురం

తాండూరు పట్టణంలో బతుకమ్మ సంబరాలు వైభవంగా జరుగుతున్నాయి. శాంతినగర్ కాలనీలోని మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పాటలు పాడుతూ కోలాటం, దాండియా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పట్టణ శివారులోని కాగ్న నదిలో నిమజ్జనం చేశామని స్నేహ బృందం ప్రతినిధి అనురాధ తెలిపారు. **- న్యూస్‌టుడే, పాత తాండూరు**

# సాగు పెరిగేలా.. అవగాహన పెంపొందించేలా..

- నేడు ఎఫ్ఆర్ఎస్‌లో డ్రాగన్ ఫ్రూట్ మేళా

**న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్**



డ్రాగన్ ఫ్రూట్



పూత దశలో

డ్రాగన్ ఫ్రూట్‌లో ఆరోగ్యానికి మేలు చేసే గుణాలెన్నో ఉన్నాయని వైద్య నిపుణులు సూచిస్తుంటారు. ఇటీవలి కాలంలో మార్కెట్‌లో ఈ ఫలాలకు డిమాండ్ పెరిగింది. డ్రాగన్ పండ్ల తోటలు సాగు చేసిన రైతులకు సైతం లాభాలు అదే స్థాయిలోనే ఉంటున్నాయి. అయితే సరైన అవగాహన లేక దీని సాగు అంతంతే ఉంది. అత్యధిక మంది రైతులు వెనకడుగే వేస్తున్నారు. ఈ పరిస్థితిని అధిగమించే లక్ష్యంతో సంగారెడ్డిలోని ఫల పరిశోధనా స్థానం అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా డ్రాగన్ ఫ్రూట్ మేళాను మంగళవారం నిర్వహించనున్నారు.

## కొనసాగుతున్న పరిశోధనలు..

సంగారెడ్డిలోని కొండా లక్ష్మణ్ ఫల పరిశోధనా స్థానం (ఎఫ్ఆర్ఎస్)లో డ్రాగన్ ఫ్రూట్‌పై పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇందుకు ప్రత్యేక బ్లాక్ ఏర్పాటుచేసి వివిధ రకాల మొక్కలను నాటి పెంచారు. ఇటీవలే ఫలసాయం సైతం వచ్చింది. డ్రాగన్ ఫ్రూట్ సాగుకు ఇక్కడి నేలలు అనుకూలమని తమ పరిశోధనల్లో ఇక్కడి శాస్త్రవేత్తలు గుర్తించారు. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లాలో 142 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. కొండాపూర్, నారాయణఖేడ్, జహీరాబాద్, సంగారెడ్డి మండలాల్లో సాగు చేస్తున్నారు. సాగు విస్తీర్ణం పెంపు లక్ష్యంగా మేళాను నిర్వహిస్తున్నారు.



డ్రాగన్ ఫ్రూట్ తోట

## అభ్యుదయ రైతులు.. ఔత్సాహికులు

మేళాలో డ్రాగన్ ఫ్రూట్‌కు చెందిన పలు రకాలను ప్రదర్శించనున్నారు. ఇప్పటికే దీన్ని సాగు చేస్తున్న రైతులతో పాటు ఈ పంట సాగుపై ఆసక్తి ఉన్న వారినీ మేళాకు ఆహ్వానించారు. ఈ పంట సాగుతో ఉన్న ప్రయోజనాలు, ప్రతికూలతలను అభ్యుదయ రైతులు వివరిస్తారు. ఎదురయ్యే ఇబ్బందులు, ఎలా అధిగమించాలన్న అంశాలపై శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు అందించనున్నారు. మార్కెటింగ్ సదుపాయం కూడా మెరుగ్గా ఉన్న నేపథ్యంలో దీని సాగుకు ప్రోత్సహించేలా కార్యాచరణ రూపొందించారు. ఉద్యాన శాఖ సంచాలకురాలు యాస్మిన్ భాషా, విశ్వవిద్యాలయం ఉప కులపతి నీరజ ప్రభాకర్, ఎఫ్ఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త సుచిత్ర తదితరులు పాల్గొని పలు అంశాలను వివరించనున్నారు.

# రోడ్డు ప్రమాదంలో దుర్మరణం



సంతోష్

**మనోహరాబాద్:** రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. మనోహరాబాద్ ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన మేడోజీ సంతోష్‌చారి(36) ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి తన మిత్రుడి పుట్టినరోజు వేడుకలకు దండుపల్లి వెళ్లి తిరిగి బయల్దేరాడు. దండుపల్లి చౌరస్తా వద్ద నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం సంతోష్‌ను ఢీకొట్టింది. దీంతో అతడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ద్విచక్ర వాహనం అదుపుతప్పి మరొకరు..



సాయిలు

**పాపన్నపేట, న్యూస్‌టుడే:** ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మల్లంపేట గ్రామ శివారులో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాలు.. కొత్తలింగాయిపల్లి గ్రామానికి చెందిన కొల్కూరి సాయిలు(48) హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పండగ నిమిత్తం సోమవారం తన ద్విచక్రవాహనంపై హైదరాబాద్ నుంచి ఇంటికి బయలుదేరాడు. మల్లంపేట గ్రామ శివారులోని మలుపు వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. తల, శరీరానికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మీతో పాటు కూతురు, కొడుకు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## కిసాన్ సమ్మాన్ నిధుల విడుదలపై హర్షం


గజ్వేల్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న భాజపా నాయకులు

గజ్వేల్, న్యూస్‌టుడే: పీఎం కిసాన్ సమ్మాన్ పథకం కింద రైతులకు 18వ విడత నిధులను విడుదల చేయడాన్ని హర్షిస్తూ సోమవారం గజ్వేల్ పట్టణంలో భాజపా నాయకులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, భాజపా పట్టణాధ్యక్షులు మనోహర్ యాదవ్ మాట్లాడుతూ.. రైతులను అన్ని విధాలుగా ఆదుకొని వారి ఆదాయాన్ని పెంచేందుకు మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో సంక్షేమ పథకాలు కొనసాగిస్తుందన్నారు. జిల్లాలో 1,27,821 మంది రైతులకు ఈ నిధులు జమయ్యాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు హామీలను నెరవేర్చకుండా కాలం గడుపుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తరుణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దినేష్, కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండం శ్రీనివాస్‌రెడ్డి, గజ్వేల్ పట్టణ ఉపాధ్యక్షులు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తి పనులు.. అధ్వాన దారులు

## గుంతల రోడ్లతో వాహనదారుల ఇబ్బందులు

న్యూస్‌టుడే, దుబ్బాక: రహదారులు బాగుంటేనే ప్రయాణం సాఫీగా సాగుతుంది. కానీ చాలా గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారడంతో రాకపోకల వేళ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేయించాల్సిన అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దుబ్బాక మండలంలోని ఎనగుర్తి నుంచి బొప్పాపూర్, ఆకారం, రఘోత్తంపల్లి, గోసాన్‌పల్లి మీదుగా శిలాజీనగర్ వరకు దాదాపు 10.8 కి.మీ. ఉన్న రోడ్డుపై పలు చోట్ల గుంతలు పడి, కంకర తేలడంతో వాహనదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. సమస్యను గుర్తించిన గత ప్రభుత్వం 2022, జులైలో రహదారి మరమ్మతులకు రూ.2.8 కోట్లు మంజూరు చేసింది.


ఆకారం శివారులో రోడ్డు దుస్థితి

మొదలుకాని పనులు: రోడ్డు మరమ్మతులకు గుత్తేదారును ఎంపిక చేసి, టెండర్ ప్రక్రియ పూర్తయి, ఏడాదిన్నర గడుస్తున్నా ఇప్పటివరకు పనులు మొదలుపెట్టలేదు. కంకరతేలిన రోడ్లతో ఇబ్బంది పడుతున్నామని, రాత్రిపూట ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: తొగుట మండలం మెట్టు నుంచి మిరుదొడ్డి మండలం అల్వాల వరకు తారురోడ్డు నిర్మాణానికి, మరమ్మతులు చేపట్టేందుకు రూ.12 కోట్లు మంజూరయ్యాయి. నిధులు వచ్చినా పనులు అసంపూర్తిగా మిగలడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు బాగు చేయాలని అల్వాల గ్రామస్థులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. తొగుట మండలం గుడికందుల నుంచి మిరుదొడ్డి మండలం అల్వాల వరకు 8 కి.మీ. దూరం ప్రయాణించాలంటే 30 నిమిషాల సమయం పడుతుందని వాహనదారులు వాపోతున్నారు. ఈ మార్గంలో ఆటోవాలాలు రావడానికి జంకుతున్నారు.

**దసరా తర్వాత పనులు ప్రారంభిస్తాం : వెంకటేశం, డీఈ(ఆర్‌అండ్‌బీ), సిద్దిపేట**

నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాల్లో గుత్తేదారు పనులు చేపట్టడంతో దుబ్బాక మండలంలో కాస్త ఆలస్యమవుతుంది. దసరా తర్వాత పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. అల్వాల నుంచి సిద్దిపేట వరకున్న 22 కి.మీ. తారురోడ్డు నిర్మాణంలో రూ.12 కోట్లతో 17 కి.మీ. పూర్తి చేశాం. త్వరలో మిగిలిన పనులు చేయిస్తాం.



న్యూస్‌టుడే, మిరుదొడ్డి

? మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామం నుంచి తొగుట మండలం గుడికందుల గ్రామం వరకు రహదారి నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. – రాజు, అల్వాల

✓ నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. వాహనదారుల ఇబ్బందులను తొలగిస్తాం. – వెంకటేశ్వర్లు, ఆర్.అండ్.బి. డీఈ, సిద్దిపేట

? అక్బర్‌పేట- భూంపల్లి మండలం వీరారెడ్డిపల్లి నుంచి జంగపల్లికి వెళ్లే మార్గంలో విద్యుత్తు తీగలు కిందికి వేలాడుతూ ఎత్తులో ఉన్నాయి. రైతులు ఆందోళన చెందుతున్నారు. – శ్రీనివాస్, వీరారెడ్డిపల్లి

✓ వదులు తీగలను సరిచేసి ప్రమాదాలను నివారిస్తాం. – శ్రీకాంత్, విద్యుత్తు శాఖ ఏఈ, మిరుదొడ్డి

## పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కండి


మార్కెట్ కమిటీ కార్యదర్శికి పన్నుల బిల్ అందిస్తున్న కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని వివిధ వ్యాపార, వాణిజ్య వర్గాల వారు పన్నులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని బల్దియా కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ కోరారు. పట్టణాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. పట్టణంలో పెండింగ్‌లో ఉన్న పన్నుల వసూళ్లకు స్వయంగా ఆయనే సోమవారం క్షేత్రస్థాయిలో వివిధ ప్రాంతాల్లో పర్యటించి పన్నులు వసూలు చేశారు. ఈ మేరకు పత్తి మార్కెట్ యార్డు- రూ.11,46,694, సమీకృత మార్కెట్- రూ.11,14,980, పశువుల మార్కెట్- రూ.11,196, మొత్తంగా రూ.22,72,870 రూపాయలు పన్నులు వసూలు చేశారు. ఆయన వెంట బల్దియా బిల్ కలెక్టర్లు శ్రీకాంత్, బాలకృష్ణ ఉన్నారు.

## కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి: సీఐటీయూ


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనాలు పెంచి అమలు చేయాలని, పల్లెల్లో తాగునీటి పర్యవేక్షకులుగా నియమిస్తున్న సిబ్బందిని సీనియార్టీ గుర్తించి వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. లేనిచో సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు. ● మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఆర్పీలకు జీవో 60 ప్రకారం వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేటలో సోమవారం ఆయన మాట్లాడారు. ఆర్పీలతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తోందన్నారు. కనీస వేతనం రూ.19500 చెల్లించాలని, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

## ముగిసిన పీఎం విశ్వకర్మ శిక్షణ


శిక్షకులు తయారుచేసిన కళాకృతులతో ప్రిన్సిపల్ వెంకటరమణ

కుకునూరుపల్లి(కొండపాక గ్రామీణం), న్యూస్‌టుడే: కుకునూరుపల్లి ఐటీఐ కళాశాలలో పీఎం విశ్వకర్మ మొదటి బ్యాచ్ శిక్షణ విజయవంతంగా పూర్తయిందని ప్రిన్సిపల్ డి.వెంకటరమణ తెలిపారు. సోమవారం ఆయన కుకునూరుపల్లిలో మాట్లాడారు. 33 మంది శిక్షకులకు ఐదు రోజుల పాటు ఇచ్చిన శిక్షణ ముగిసిందన్నారు. శిక్షణలో పొందిన వారిలో ఇద్దరు మహిళలూ ఉన్నారని తెలిపారు. శిక్షణ పొందిన వారు చేతితో తయారుచేసిన కొన్ని కళాకృతులు బాగున్నాయని కితాబునిచ్చారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి రూ.15వేల టూల్ కిట్ ఉచితంగా కేంద్రం ప్రభుత్వం ద్వారా అందుతుందని తెలిపారు. కుకునూరుపల్లి ఐటీఐలో మరో ఆరు కొత్త కోర్సుల్లో దరఖాస్తులు ప్రారంభించామని, ఆసక్తిగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. శిక్షణాధికారి సత్యనారాయణ, శిక్షణ కో-ఆర్డినేటర్ కనకరాజు, శిక్షకుడు బ్రహ్మచారి తదితరులు ఉన్నారు.

## పోషకాహారంతోనే గర్భిణులకు ఆరోగ్యం


పోషకాహార కిట్ అందజేస్తున్న కత్తి కార్తీకగౌడ్

దుబ్బాక, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో ఎనిమిది నెలలు దాటిన గర్భిణులకు కత్తి కార్తీక ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'మా ఇంటి మహాలక్ష్మి' పేరుతో పోషకాహార కిట్లను సోమవారం దుబ్బాక మండలంలోని అచ్చుమాయిపల్లి, పర్శరాంనగర్, పెద్దచీకోడ్ గ్రామాల్లోని 10 గర్భిణులకు భారాస నాయకురాలు కత్తి కార్తీక గౌడ్ అందజేశారు. ఈ కిట్లలో 4 డబ్బాల పాలు, రాగి పిండి, బెల్లం, కొబ్బరి, ఖర్జూర పండ్లు మొదలైన ఆహార పదార్థాలను ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యకరమైన శిశువులకు జన్మనిచ్చే అవకాశం ఉంటుందన్నారు. స్వామి, దేవిరెడ్డి, చంద్రం, ప్రసాద్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## ఇలాగైతే.. దాహం తీరేదెలా!


తుప్పు పట్టిన చేతిపంపు

ఒకప్పుడు బాటసారులు, భక్తుల దాహార్తి తీర్చిన చేతి పంపు.. నేడు తుప్పు పట్టి నిరుపయోగంగా మారింది. చిత్రంలో శిథిలమై కనిపిస్తున్న చేతిపంపు సిద్దిపేట, హుస్నాబాద్ ప్రధాన రహదారిలో సముద్రాల గండిమైసమ్మ గుడి వద్ద ఉంది. ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోక వృథాగా మారడంతో ఆలయానికి వచ్చే భక్తులు, ప్రజలకు తాగునీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాడైన చేతిపంపుకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోహెడ

## సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయండి: ఎంఎస్‌పీ

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పరశురాములు డిమాండ్ చేశారు. సిద్దిపేటలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే స్వాగతించిన సీఎం రేవంత్‌రెడ్డి ఆ దిశగా ప్రస్తుతం చర్యలు తీసుకోవడం లేదన్నారు. రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 9న కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతామన్నారు.

## పవర్‌గ్రిడ్ కాదు.. ప్రభుత్వ వెంచర్


మల్లన్నసాగర్ నిర్వాసితుల వెంచర్‌లో పాతిన స్తంభాలు

మల్లన్నసాగర్ నిర్వాసితులకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బల్దియా పరిధిలోని సంగాపూర్ వద్ద ప్రభుత్వం వెంచర్ ఏర్పాటు చేసింది. ఇక్కడ ఇళ్లను నిర్మించేందుకు ప్రభుత్వం కల్పించిన మౌలిక వసతుల్లో భాగంగా విద్యుత్తు స్తంభా పాతారు. వాటిని దూరం నుంచి చూస్తే పవర్ గ్రిడ్ వద్ద ఏర్పాటు చేసినట్లుగా ఉన్నాయి. దగ్గరికి వెళితేగాని అది వెంచర్‌లో ఇంటి స్థలాల మధ్య పాతారని తెలుస్తోంది. దాదాపు పది ఎకరాల్లో ఇంటి స్థలాలు ఏర్పాటు చేసి వందలాది స్తంభాలు పాతగా అవి చూపరులను ఆకర్షిస్తున్నాయి. - న్యూస్‌టుడే, గజ్వేల్

## వడ్డేపల్లి అడవిలో చిరుత సంచారం?

రాయపోల్: మండలంలోని వడ్డేపల్లి అటవీ ప్రాంతంలో రెండు పిల్లలతో కలిసి చిరుత సంచరిస్తోందని గ్రామస్థులు తెలిపారు. నాలుగు రోజుల కిందట గడ్డం భిక్షపతి పొలంలో పనులు చేస్తున్న కొందరు దేవిగుట్ట వద్ద పిల్లలతో చిరుత తిరుగుతోందని భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై ఫారెస్ట్ సెక్షన్ అధికారి హైమద్ హుసేన్‌ను వివరణ కోరగా.. పరిశీలిస్తామన్నారు.

## సేంద్రియ ఎరువుల తయారీపై రైతులకు అవగాహన


అగ్నిఅస్త్రం తయారీ గురించి తెలుసుకుంటున్న రైతులు

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం), న్యూస్‌టుడే: అక్కన్నపేట మండలం గొల్లకుంటలో దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ పత్తి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తిపంటకు ఆశించే కాయతొలుచు, కాండం తొలుచు పురుగుల నివారణ, సేంద్రియ పద్ధతిలో తయారుచేసే అగ్నిఅస్త్రం తయారీ, దానివల్ల కలిగే ప్రయోజనాల గురించి సంస్థ క్షేత్రస్థాయి సమన్వయకర్త సంగ శ్రీధర్ రైతులకు అవగాహన కల్పించారు. దీనివల్ల తెగుళ్ల నివారణతో పాటు రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. రైతులు భైరి ప్రవీణ్, కాశబోయిన శ్రీనివాస్, గూళ్ల రఘు, భైరి కనకయ్య, ఆశయ్య పాల్గొన్నారు.

## పంట పొలాల పరిశీలన.. రైతులకు సూచన


కోహెడలో వరి పైరును పరిశీలిస్తున్న ఏవో సతీష్

కోహెడ, కోహెడ గ్రామీణం న్యూస్‌టుడే: కోహెడ మండలంలోని పంట పొలాలను ఏవో సతీష్ రైతులతో కలిసి పరిశీలించారు. వాతావరణ మార్పుల్లో భాగంగా వరి పైరులో ఆకుముడత, కాటుక తెగుళ్లు సోకే అవకాశముందని తెలిపారు. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ అధికారుల సూచనతో క్రిమిసంహారక మందులు పిచికారి చేయాలని సూచించారు. ఏఈవోలు శ్రీధర్‌రెడ్డి, శివ, రాకేష్ పాల్గొన్నారు.

## ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో కవాతు


ర్యాలీలో పాల్గొన్న సభ్యులు

బెజ్జంకి, హుస్నాబాద్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ఆవిర్భవించి వందో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా సోమవారం బెజ్జంకిలో సభ్యులు కవాతు నిర్వహించారు. జెండాలు చేతబట్టి అంబేడ్కర్, శివాజీ, ఎల్లబండి కూడళ్లలో కవాతు చేపట్టారు. జిల్లా వ్యవస్థ ప్రముఖ్ నర్సింహులు, చంద్రారెడ్డి, అమరేంద్రప్రసాద్, మహిపాల్‌రెడ్డి, అశోక్, రవి, అనిల్‌రావు, శ్రీనివాస్, సత్యనారయణ, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు. ● రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా హుస్నాబాద్‌లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు కవాతు నిర్వహించారు. చంద్రమౌళి, సత్యనారాయణ చారి, లక్కిరెడ్డి వీరారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆత్మీయ సమ్మేళనం


పోతారెడ్డిపేటలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

దుబ్బాక: అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతారెడ్డిపేట జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 2005-06 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన గురువులను శాలువా, మెమొంటోలతో సత్కరించారు.

## యంత్రంలో చేయి చిక్కుకొని ఒకరికి గాయాలు

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: కంకుల మరయంత్రంతో నూర్పిడి చేస్తుండగా ప్రమాదవశాత్తు ఓ రైతు చేయికి తీవ్ర గాయాలైన ఘటన అక్బర్‌పేట- భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన చాంద్ పాషా తాను పండించిన మొక్కజొన్న పంటను నూర్పిడి చేస్తుండగా ప్రమాదవశాత్తు మరయంత్రంలో కుడి చేయి చిక్కుకొని తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న 108 వాహనంలో అతడిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.



## జూద స్థావరంపై దాడి.. ఏడుగురి అరెస్టు

దుబ్బాక, న్యూస్‌టుడే: మండలంలోని పెద్ద చీకోడ్ గ్రామ శివారులో సోమవారం సాయంత్రం జూదం ఆడుతున్న స్థావరంపై పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేసి, ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు జూదం ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారంతో దుబ్బాక, సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి, ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5,470 నగదు, 7 చరవాణులు, 6 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా దుబ్బాక ఎస్సై గంగరాజు మాట్లాడుతూ.. ఎవరైనా జూదం, మట్కా, బెట్టింగ్‌లు, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే, తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

## మందుబాబులకు జరిమానా

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మద్యం తాగి పట్టుబడిన పలువురు వాహనదారులకు సోమవారం సిద్దిపేట జిల్లా ద్వితీయశ్రేణి జ్యుడిషియల్ న్యాయమూర్తి కాంతారావు జరిమానా విధించారు. గత కొన్ని రోజుల కిందట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం, నర్సాపూర్, రంగధాంపల్లి చౌరస్తాలు, మెదక్ రోడ్, వేములవాడ కమాన్ వద్ద ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా 24 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. నిర్ధారణ పరీక్షల అనంతరం నివేదిక ఆధారంగా వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి మొత్తంగా రూ.44,500 జరిమానా విధించారు.

## 'భగీరథ' సద్వినియోగంపై అవగాహన కల్పించండి: ఈఈ


మాట్లాడుతున్న గిరిధర్

నంగునూరు, న్యూస్‌టుడే: మిషన్ భగీరథ నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని మిషన్ భగీరథ ఈఈ గిరిధర్ సిబ్బందికి సూచించారు. నంగునూరు మండల పరిషత్ కార్యాలయంలో మంచినీటి సహాయకులకు నిర్వహిస్తున్న శిక్షణ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీలు కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో చేతిపంపుల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. బోరుమోటార్లు కాలిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, శిక్షణ నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. ఎంపీడీవో లక్ష్మప్ప, ఎంపీవో సత్యనారాయణ, డిప్యూటి ఈఈ సుమలత, ఏఈ నర్సింగరావు తదితరులు ఉన్నారు.

## సీపీఐ కార్యాలయంలో పతాకం ఆవిష్కరణ

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్‌లోని అనభేరి, సింగిరెడ్డి అమరుల భవనంలో అక్టోబరు మహా విప్లవ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కోయడ కొమురయ్య పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. సీపీఐ మండల కార్యదర్శి గడిపె మల్లేశ్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సంజీవరెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు యాద పద్మ, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, అక్బర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించండి

చేర్యాల, న్యూస్‌టుడే: మండలంలోని కడవేర్గులో 'కొమ్మూరి యువసేన' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను చేర్యాల సీఐ ఎల్.శ్రీను చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ నైపుణ్యం పెంచుకోవాలని, సమయాన్ని వృథా చేయకుండా ఆటలపై ఆసక్తిని చూపాలన్నారు. దీని ద్వారా చెడు అలవాట్లు యువత దరిచేరవన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆరుట్ల వినీత్, తాడెం రమేశ్, డి.లింగారెడ్డి, నీరటి విజయ్, గదరాజు నరేశ్, ఎస్‌డీ నౌషద్, గదరాజు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నిందితుడిని కఠినంగా శిక్షించాలి

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలకు, చిన్నారులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ యాదవ్, జ్యోతిబాబు, రమేశ్, సురేశ్, తదితరులు ఉన్నారు.

## బతుకమ్మ ఏర్పాట్లపై పరిశీలన

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్‌లో ఎల్లమ్మ చెరువు కట్టపై జరిగే సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను పురాధ్యక్షురాలు ఆకుల రజిత, కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ పరిశీలించారు. సోమవారం ఎల్లమ్మచెరువు, పల్లెచెరువు కట్టలను సందర్శించి అక్కడ చేయాల్సిన ఏర్పాట్ల గురించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. వారితో పాటు కౌన్సిలర్లు ఉన్నారు.



## రేషన్ బియ్యం పట్టివేత

జగదేవపూర్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాలు.. జగదేవపూర్ మండలం చాట్లపల్లిలో కొంతమంది రేషన్ బియ్యం కొనుగోలు చేసి పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామ పరిసరాల్లో మకాం వేసి వాహనంలో తరలిస్తుండగా 39 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. డ్రైవర్ బీరోల్ల కృష్ణను విచారించగా వాహనం పుట్టగుడానికి చెందిన మాలోతు ఉమేష్‌కు చెందినదని తెలిపాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

ములుగు: వరుస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ములుగు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు.. ఇటీవల ములుగు మండలం వాగునుతి, బైలంపూర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో వరుస చోరీలు జరిగాయి. వాటిపై దర్యాప్తు చేస్తుండగా సోమవారం వంటిమామిడి వద్ద గజ్వేల్ గ్రామీణ సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. అదే సమయంలో మామిడ్యాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన పద్దుల కనకయ్య అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించగా వాగునుతి, బైలంపూర్‌లో జరిగిన చోరీలు తానే చేసినట్లు అతను ఒప్పుకున్నారు. అతని నుంచి రూ.1.17 లక్షల నగదు, 2 తులాల బంగారం, 20 తులాల వెండి స్వాధీనం చేసుకున్నారు.

## దేవీ వైభవం.. భక్తుల తన్మయత్వం


చేర్యాల: చావడి వద్ద శాఖంబరిగా అమ్మవారు


కొండపాక గ్రామీణం: శాకాంబరిగా విజయదుర్గా


సిద్దిపేట టౌన్: చాముండేశ్వరీగా దుర్గామాత


మిరుదొడ్డిలో అమ్మవారు

సిద్దిపేట టౌన్, చేర్యాల, కొండపాక గ్రామీణం, మిరుదొడ్డి, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తులు పాల్గొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.


చేర్యాల: దుర్గామాత ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న పురాధ్యక్షురాలు స్వరూపారాణి, తదితరులు